సాక్షి
నల్లగొండ
గురువారం : 24 । జూలై । 2025



దొంగల ముఠా అరెస్ట్

రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను నల్లగొండ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. - 8లో



శుభకార్యాలకు వేళాయె

శ్రావణం శుభకార్యాలకు అనువైన మాసం. శుక్రవారం నుంచి శ్రావణం మొదలై ఆగస్టు 22 వరకు కొనసాగనుంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :		590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	573.00 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,21,967 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	5,174 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా :		2,700 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	3,374 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాలో 60 రోడ్ల అభివృద్ధికి అనుమతి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో హైబ్రీడ్ అన్యూటీ మోడ్ (హామ్) పథకం కింద 60 రోడ్ల విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. పనులను రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. నల్లగొండ- 1 పరిధిలో 223.12 కిలోమీటర్ల పొడవున 18 రోడ్లను రూ.302.45 కోట్లతో విస్తరణ అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. అలాగే నల్లగొండ-2 పరిధిలో 314.66 కిలోమీటర్ల పొడవున రూ.320.80 కోట్లతో 26 రోడ్లను అభివృద్ధి విస్తరణ పనులను చేపట్టనుంది. యదాద్రి భువనగిరి జిల్లాలో 287.50 కిలోమీటర్ల పొడవున రూ.389.73 కోట్లతో 16 రోడ్ల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది.

ఓయూ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ): ఉస్మానియా విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, ఫిలాసఫీ, సోషియాలజీ, ప్రభుత్వ పాలనాశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, సైకాలజీ, ఎంకాం, ఎమ్మెస్సీ గణితశాస్త్రం, స్టాటిస్టిక్స్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులతోపాటు ముప్పై కాంబినేషన్లలో డిగ్రీ కోర్సులు, తొమ్మిది రకాల డిప్లొమా కోర్సులు, యోగాలో సర్టిఫికేట్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 15 సెప్టెంబర్ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు www.oucde.net వెబ్‌సైట్‌తోపాటు సెల్ : 9398673736, 9866977741 నంబర్లను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

జనగామ జిల్లాకు నల్లగొండ ఇసుక

నల్లగొండ : జనగామ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి జిల్లా నుంచి లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను ఇచ్చేందుకు నిర్ణయించారు. బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించారు. ఇసుక లేని జిల్లాలకు ఇసుక రీచ్‌లు ఉన్న జిల్లాల నుంచి ఇసుకను సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే శాలిగౌరారం మండలం వంగమర్తి, చిత్తలూరు ఇసుక రీచ్‌లలో కొత్తగా గుర్తించిన ప్రదేశం నుంచి 27 హెక్టార్లలో ఇసుక తీసేందుకు రాష్ట్ర టీజీఎండీసీకి ప్రతిపాదనలు పంపేందుకు తీర్మానించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా గనుల శాఖ సహాయ సంచాలకుడు శామ్యూల్ జాకబ్ పాల్గొన్నారు.

గరిష్ట నీటిమట్టానికి చేరువగా 'మూసీ'

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమం పెరుగుతూ గరిష్ట స్థాయికి కేవలం రెండు అడుగుల దూరంలో ఉంది. బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి 1,799 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం (4.66 టీఎంసీలు) గల మూసీ ప్రాజెక్టు బుధవారం సాయంత్రం నాటికి 643 (3.91 టీఎంసీలు) అడుగులకు చేరుకుంది. కుడి కాల్వకు 262 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 307 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సీపేజీ, లీకేజీ రూపంలో 70 క్యూసెక్కుల నీరు వృథా అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

సమగ్ర వికాసానికి గ్రంథాలయాలు అవసరం



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ : చిన్నారుల సమగ్ర వికాసానికి గ్రంథాలయాలు ఎంతో అవసరమని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. బుధవారం నల్లగొండలోని డైట్‌లో నిర్వహించిన కాంప్లెక్స్ స్థాయి ఉపాధ్యాయుల శిక్షణలో ఆయన మాట్లాడారు. పిల్లలు వివిధ పుస్తకాలు చదవడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకుంటారన్నారు. చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఆర్పీ నర్సింహమూర్తి, సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య పాల్గొన్నారు.



క్లాక్ టవర్ సమీపంలోని ఎస్‌బీఐ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట రోడ్డు దుస్థితి

నీలగిరి రోడ్లు అధ్వానం!

రామగిరి నుంచి క్లాక్‌టవర్ వరకు గుంతలమయం

- ప్రధాన రోడ్లతోపాటు కాలనీల్లోనూ అస్తవ్యస్తం
- వర్షాకాలం కావడంతో తప్పని ఇబ్బందులు
- పట్టింపులేని యంత్రాంగం



ధ్వంసమైన తులసి నగర్ రోడ్డు



పానగల్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా కేంద్రమైన నీలగిరి పట్టణంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో పట్టణ రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. కిలోమీటరు దూరంలోనే పదుల సంఖ్యలో పడిన గుంతలు పాలకుల కళ్లకు కనిపించడం లేదు. రామాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు ఉన్న ప్రధాన రోడ్డే గుంతలతో ప్రమాదకరంగా మారింది. ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఏకాస్త ఏమరుపాటు వహించినా ప్రమాదం బారిన పడక తప్పదు. ఇక కాలనీల్లో పరిస్థితి అంతే. ఏ కాలనీలో చూసినా దెబ్బతిని అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లతో ప్రస్తుత వర్షాకాలంలో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పాలకుల పట్టింపేది..

నీలగిరి పట్టణ అభివృద్ధికి రూ.వందల కోట్లు వెచ్చించామని చెబుతున్న యంత్రాంగం, పాలకులు అన్ని రోడ్లను మరమ్మతులు చేయడంలేదు. వాహనదారులు అడుగడుగునా అవస్థలు పడుతున్నా ఏ శాఖకు పట్టడం లేదు. ఇటు మున్సిపల్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండగా, అటు రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖలు ప్రధాన రోడ్లను కూడా పట్టించున్న పాపాన పోవడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాలు నడిపే వారు ఆ గుంతల్లో ప్రయాణిస్తూ నడుము నొప్పులు కొనితెచ్చుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

నిత్యం వేల సంఖ్యలో ప్రయాణం

నల్లగొండ పట్టణంలోని రామగిరి నుంచి క్లాక్ టవర్‌కు వెళ్లే రోడ్డులో నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తారు. కార్లు, బస్సులు, బైక్‌లు, ఆటోలు, లారీలు ఇలా రకరకాల వాహనాలు ఈ ప్రధాన రోడ్డుపై ప్రయాణిస్తాయి. గుంతలు పడిన రోడ్డుపై ప్రయాణం చేస్తున్న సమయంలో నడుము నొప్పి, స్పాండిలైటిస్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడే వారి పరిస్థితి చెప్పనవసరం లేదు. వాహనాలు ఆ గుంతల్లో పడి వాహనాలు ఎత్తేస్తుంటే నడుము విరిగిపోతుందా? అనేంత బాధను భరిస్తూ వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. కనీసం తాత్కాలిక మరమ్మతులు అయినా చేస్తారా? అంటే అదీ చేయడం లేదు. వర్షాలు కాస్త ఎక్కువ పడితే ఆ గుంతల్లో నీరు నిలిచిపోయి ఎక్కడ ఎంత లోతు గుంత ఉందో కూడా తెలియక ప్రయాణికులు ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. పట్టణం నడిబోడ్డునే ఏళ్ల తరబడి ఇంత ఇబ్బందికరంగా రోడ్లు దెబ్బతిన్నా యంత్రాంగం సాకులతో కాలం వెళ్లదీస్తోంది తప్ప వాహనదారుల బాధలను పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామీణ రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లే..

క్లాక్ టవర్ నుంచి రామగిరి వెళ్లే రోడ్డు, రామగిరి చౌరస్తా నుంచి ఎన్‌జీ కాలేజీ వెళ్లే రోడ్డు, బోయవాడ, విద్యుత్ శాఖ కార్యాలయం ముందు రోడ్డు, బొట్టుగూడ, దేవరకొండ రోడ్డు అంబేద్కర్ సర్కిల్, ఆర్పీ రోడ్డు, బహార్‌పేట, తులసి నగర్ రోడ్డు, క్లాక్ టవర్ వద్ద జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద, సావర్కర్ నగర్ రోడ్డు, ఫ్లైఓవర్ వద్ద, పానగల్ రోడ్డు ఇలా ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లతో ప్రయాణికులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అయినా ఏ శాఖకు నీలగిరి మంటే పట్టణం పట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



క్లాక్ టవర్ నుంచి రామగిరి వైపు వెళ్లే రోడ్డుపై గుంతలు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నార్కట్‌పల్లి : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. నార్కట్‌పల్లిలోని నల్లగొండ ఫ్లైఓవర్ ఎస్‌హెచ్-2, గోపాలయపల్లి దేవాలయ ఆర్చి వద్ద గల ఎన్‌హెచ్ 65 బ్లాక్ స్పాట్స్‌ను బుధవారం ఎస్పీ పరిశీలించి మాట్లాడారు. నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద గల ఎస్‌హెచ్-2 రోడ్డుపై రాత్రి సమయంలో హోటల్స్, వివిధ షాప్స్‌ల వద్ద వాహనాలు నిలిపి ఉండడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపైన ఉన్న షాప్‌లను హోటల్స్ పక్కకు జరిపించాలని నేషనల్, స్టేట్ హైవేల ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ప్రమాదాల నివారణకు జీబ్రా లైన్లు, రేడియం స్టికర్లు, హైమాస్ట్ లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే స్పందించిన అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలను పూడ్చించారు. కొన్ని దుకాణాలను రోడ్డుకు దూరంగా జరిపించారు. ఎస్పీ వెంట నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్‌ఐ క్రాంతికుమార్, ఎన్‌హెచ్65 ప్రాజెక్టు మేనేజర్ నాగకృష్ణ, ఇంజనీర్ మధుకిరణ్, కన్సల్టెంట్ కిషన్‌రావు, ఎస్‌హెచ్-2 మెయింటెన్స్ మేనేజర్ షహదుల్లా, ఇంజనీర్ మధార్, ఏఎంవీఐ సోనిప్రియ, ఎక్సైజ్ ఎస్‌ఐ విజయకుమార్, రిటైర్ సీఐ అంజయ్య ఉన్నారు.



నార్కట్‌పల్లిలోని నల్లగొండ బైపాస్‌లో బ్లాక్‌స్పాట్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

ఎరువులను అధిక ధరలకు అమ్మొద్దు : డీఏఓ

చిట్యాల : ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏఓ శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. చిట్యాలలో బుధవారం ఎరువుల, విత్తనాల దుకాణాలను, గోడౌన్‌లను తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు, ఎరువుల, విత్తనాల స్టాక్ రిజిస్టర్‌ల నమోదును, ఈపాస్ యంత్రాలలో అమ్మకాల వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. చిట్యాల మండలానికి 897 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. ఎరువుల సరఫరాలో ఇబ్బందులున్నట్లయితే 18004251442 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఏఓ గిరిబాబు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం
- బి.వెల్లంల కుడికాల్వ ద్వారా తొలిసారి చెరువులకు నీటి విడుదల

నార్కట్‌పల్లి : రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని గోపాలయపల్లి, నార్కట్‌పల్లి, మాదవ ఎడవల్లి, ఏపీ లింగోటం చెరువులను నింపేందుకు తొలిసారిగా బుధవారం బి.వెల్లంల ప్రాజెక్టు కుడికాల్వ నీటి విడుదల చేశారు. ప్రాజెక్టులో భాగంగా గోపలాయపల్లి వరకు కొనసాగి నిలిచిన కుడి కాల్వ పనులను నార్కట్‌పల్లి చెరువు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర గోపాలయపల్లి, నార్కట్‌పల్లి, మాదవ ఎడవల్లి, ఏపీ లింగోటం గ్రామాల రైతులు సొంత ఖర్చుతో జేసీబీని పెట్టి పూర్తిచేసుకున్నారు. దీంతో ఈ కాల్వ ద్వారా చెరువులకు ఎమ్మెల్యే నీటిని విడుదల చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన బి.వెల్లంల ప్రాజెక్టును కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పూర్తిచేసుకుని నేడు సాగునీటిని అందుస్తున్నామని పేర్కొన్నారు. ఈ నాగులు గ్రామాల చెరువుల నిండితే వరి పంటకు సాగునీటి ఇబ్బందులు ఉండవన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు భూ సేకరణ పూర్తిచేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు పిచ్చయ్య, విఠలేశ్వర్, ఏఈ నవీన్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, బండా సాగర్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐతరాజు యాదయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జేరిపోతుల భరత్, నేతగాని కృష్ణ, గోసుల భద్రచలం, దొండ రమేష్, సిద్దగోని స్వామి, పశుపతి, వెంకన్న, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బి.వెల్లంల ప్రాజెక్టు కుడి కాల్వకు నీటి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

మహాలక్ష్మి పథకం.. మహిళలకు వరం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మహిళకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఆర్‌ఎం జానిరెడ్డి

రామగిరి(నల్లగొండ): మహాలక్ష్మి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం మహిళలకు వరం లాంటిదని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం మైలురాయి దాటిన సందర్భంగా నిర్వహిస్తున్న సంబరాల్లో భాగంగా బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెట్రో రైలులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్లే ఢిల్లీలో తాను డిగ్రీ పూర్తిచేయగలిగానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఎంతోమంది మహిళలకు చదువు, ఉద్యోగం, వ్యాపారపరంగా మేలు జరుగుతందన్నారు. ఉచిత బస్సుల్లో ఎక్కువమంది మహిళా కండక్టర్లు, డ్రైవర్లు ఉంటే బాగుంటుందన్నారు. ఇందుకు కృషిచేసిన ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. నల్లగొండ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, నల్లగొండ డిపో మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన మధుశ్రీ, దీక్షిత, కరుణప్రియ, శ్రీలక్ష్మి, ఎస్‌కే ఆఫ్రిన్లకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. అలాగే రెగ్యులర్‌గా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసిన మహిళా ప్రయాణికులు మాధవి, జ్యోతి, గీత, ఉష, అనసూయను జ్ఞాపికలతో సన్మానించారు.

10.31 కోట్ల మంది.. ఉచిత బస్సు ప్రయాణం

రామగిరి(నల్లగొండ) : మహాలక్ష్మి పథకం కింద నల్లగొండ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు 10,31,28,640 మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. తద్వారా ఆర్టీసీకి రూ.502 కోట్ల ఆదాయం సమకూరింది. దేవరకొండ డిపో పరిధిలో 1.96 కోట్ల మంది, నల్లగొండ పరిధిలో 1,53,52,391 మంది, మిర్యాలగూడ పరిధిలో 1,54,85,729 మంది, నార్కట్‌పల్లి డిపో పరిధిలో 36,25,576 మందితో నల్లగొండ జిల్లాలో మొత్తం 5,44,0 9149 మంది మహిళలు ఉచిత బస్సుల్లో ప్రయాణించారు. అలాగే సూర్యాపేట డిపో పరిధిలో 2.10కోట్లమంది, కోదాడ డిపో పరిధిలో 1.25 కోట్లతో కలిపి సూర్యాపేట జిల్లా మొత్తంగా 3.35 కోట్ల మంది మహిళలు ప్రయాణించారు. ఇక, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని యాదగిరిగుట్ట డిపో పరిధిలో 1,54,25,000 మంది మహిళా ప్రయాణికులు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు.

ఏటీసీని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

హాలియా : పట్టణంలో నూతనంగా నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లో మెషినరీలు ఏర్పాటు చేసినందున త్వరగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హాలియాలోని ఏటీసీ సెంటర్‌ను బుధవారం వారు పరిశీలించారు. ఏటీసీలో ఉన్న సౌకర్యాలు, విద్యార్థుల సంఖ్య, బ్యాచ్‌ల వివరాలను ఏటీసీ ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, రోబొటిక్ ఎక్సలెన్సీ, యంత్ర సామగ్రిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం ఐటీఐ కళాశాలలో రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. రేషన్‌కార్డులు, ఇళ్లు రాని వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, ఇంచార్జ్ తహసీల్దార్ రఘు ఉన్నారు



హాలియాలో ఏటీసీని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తడకమళ్లలో సబ్‌స్టేషన్ భూమి పరిశీలన

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామంలోని 719 సర్వే నంబర్‌లో గల సబ్‌స్టేషన్ భూమి ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనని తహసీల్దార్ సురేష్ తెలిపారు. సబ్ స్టేషన్ భూమి కబ్జా శీర్షికన ఈనెల 22 సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. దీంతో బుధవారం తడకమళ్ల సబ్‌స్టేషన్ స్థలాన్ని ఆర్‌ఐ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోనే ఈ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు సైతం ఏర్పాటు చేశామని, ఆ బోర్డును తొలగించి భూ కబ్జాకు పాల్పడ్డారన్నారు. ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసచారి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ భూమి కబ్జాకు గురైన విషయంపై రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. పూర్తి విచారణ అనంతరం భూమిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా గ్రామంలో ఈ భూమి కబ్జా గురించి చర్చ జరుగుతున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సును దగ్ధం చేసిన సంఘటన సంచలనంగా మారింది. ఈ బస్సు దగ్ధం ఘటనలోనూ ఈ భూ కబ్జాదారుడే ప్రధాన పాత్రధారిగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ముసురుతో పత్తి చేలకు జీవం

- రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు
- ఏపుగా పెరుగుతున్న చేలు
- ఎరువు పెట్టుకునేందుకు సిద్ధమవుతున్న రైతులు
- జిల్లాలో 5 లక్షల ఎకరాలకుపైగా పత్తిసాగు



ఎల్లారెడ్డిగూడెం సమీపంలో ఎరువు పెట్టిన పత్తి చేను

నల్లగొండ అగ్రికల్చర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ముసురుతో కూడిన చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు 8.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శాలిగౌరారం మండలంలో 54.4మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా దేవరకొండ మండలంలో 0.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత వారం రోజుల క్రితం వరకు జిల్లాలో సరైన వర్షాలు లేక పత్తి చేలు వాడుబట్టాయి. ఈక్రమంలో ఐదు రోజుల క్రితం కురిసిన వర్షం పత్తి చేలకు జీవం పోసింది. అదే అదునులో రైతులు పత్తి చేలకు ఎరువు చల్లుతూ.. కలుపు తీసుకుంటున్నారు. ఈ తరుణంలో రెండు రోజుల నుంచి ముసురు పట్టడంతో పత్తిచేలు మరింత నిగనిగలాడుతున్నాయి. ముసురు తగ్గితే రైతులు ఎరువులు పెట్టుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఎరువు పెట్టుకున్న రైతులు కలుపులు తీసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలంలో 6,40,567 ఎకరాల్లో పత్తి సాగుకానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు 5,02,641 ఎకరాల్లో రైతులు పత్తిసాగు చేశారు.

పంట	అంచనా	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో..)
పత్తి	6,40,567	5,02,641
వరి	5,25,350	65,284
జొన్న	500	55
కంది	10,000	1,545
పెసర	1,200	166

ఎరువు పెట్టుకున్నాం



ఐదు రోజుల క్రితం కురిసిన వర్షానికి పత్తి చేనుకు ఎరువు పెట్టుకున్నాం. ఇప్పుడు రెండు రోజుల నుంచి అదునైన వర్షం కురుస్తుండంతో పత్తి చేలు ఏపుగా పెరుగుతున్నాయి. ముసురుతో కూడిన వర్షం వల్ల పత్తిచేలకు ఎంతో మేలు జరుగుతుంది.

– జానపాటి రాజేంద్రప్రసాద్, రైతు, గుండ్లపల్లి

వర్షం తగ్గితే ఎరువులు పెట్టుకోవచ్చు



ప్రస్తుతం కురుస్తున్న ముసురుతో కూడిన వర్షంతో మెట్టపంటలకు చాలా ప్రయోజకరంగా ఉంది. వర్షం తగ్గిన వెంటనే పత్తి చేలకు ఎరువులు పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే ఎరువులు పెట్టిన చేలు ఏపుగా పెరుగుతాయి.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీను (ఫైల్)

నేరేడుచర్ల: విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నెలో జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్ దిన్నెకి చెందిన నగిరి శ్రీను(57) నారుమడికి నీరు పెట్టేందుకు బుధవారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో కారోబార్ ఆత్మహత్య

నార్కట్‌పల్లి: అప్పుల బాధతో ఉరేసుకుని గ్రామ పంచాయతీ కారోబార్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కారోబార్ షేక్ షకీల్ అహ్మద్(29) ఇంటి నిర్మాణం కోసం శ్రీరామ్ చిట్‌ఫండ్స్‌లో రూ.12 లక్షల లోన్ తీసుకున్నాడు. లోన్ కట్టలేక అప్పులు ఎక్కువై మనస్తాపంతో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షేక్ నజియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం మృతుడి కుటుంబ సభ్యులకు గ్రామ పంచాయతీ తరఫున రూ.10వేలను పంచాయతీ కార్యదర్శి అలేందర్‌రెడ్డి అందజేశారు.

ఐదేళ్లు జైలు శిక్ష

మోత్కూరు: హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ రామన్నపేట కోర్టు జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పాడిచేడు గ్రామానికి చెందిన కాసర్ల జానయ్యకు అదే గ్రామానికి చెందిన కాసర్ల అంజయ్య మధ్య పొలం గెట్టు వివాదం కొనసాగుతుండగా.. 2020లో కాసర్ల జానయ్య కాపుగాసి కాసర్ల అంజయ్యపై గొడ్డలితో దాడి చేసి గాయవర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ హరిప్రసాద్ కేసు నమోదు చేసి జానయ్యను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా బుధవారం రామన్నపేట కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నిందితుడు కాసర్ల జానయ్యకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జానయ్యను నల్లగొండ జిల్లా జైలుకు తరలించినట్లు మోత్కూరు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

అరటికాయల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా

- అందినకాడికి లూటీ చేసిన జనం

పెద్దవూర: అరటికాయల లోడుతో వెళ్తున్న డీసీఎం పెద్దవూర మండలం అచ్చన్నబావి సమీపంలో బుధవారం తెల్లవారుజామున బోల్తా పడింది. విషయం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు డీసీఎం వద్దకు చేరకుని అందినకాడికి అరటికాయలు లూటీ చేశారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పోరుమామిళ్ల నుంచి అరటికాయల లోడుతో డీసీఎం హైదరాబాద్‌కు వెళ్తోంది. బుధవారం తెల్లవారుజామున 3.00గంటల ప్రాంతంలో నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై పెద్దవూర మండలం అచ్చన్నబావి సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో డీసీఎం అదుపుతప్పి రోడ్డు పక్కన బండరాయిని ఢీకొని బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అరటికాయల డీసీఎం బోల్తా పడిందని తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని ట్రేలతో సహా అరటికాయలను ఎత్తుకెళ్లారు. అరటికాయలు తీసుకెళ్లినా పర్వాలేదని, ట్రేలను మాత్రం తీసుకెళ్లొద్దని డ్రైవర్ ఎంత ప్రాధేయపడినా వినిపించుకోకుండా అందినకాడికి దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను అక్కడి నుంచి పంపించేశారు. డీసీఎంలో రూ.4లక్షల సరుకు ఉండగా.. సగానికి పైగా తీసుకెళ్లారని, వందకు పైగా ట్రేలను అపహరించుకుపోయినట్లు డ్రైవర్ వాపోయాడు. మిగిలిపోయిన అరటికాయలను వేరే డీసీఎంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.


వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న దుండుబి వాగు

దుండుబి జోరు.. డిండిలోకి నీరు

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కురుస్తున్న వర్షానికి తోడు కేఎల్ఐ(కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్) ద్వారా వస్తున్న నీటితో దుండుబి వాగు దిగువకు పరవళ్లు తొక్కుతోంది. డిండి ప్రాజెక్టులోకి వరద భారీగా వస్తోంది. 800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా బుధవారం సాయంత్రం సమయానికి 15 అడుగుల వరకు ఉందని ఇరిగేషన్ ఏఈ సాయికుమార్ తెలిపారు.

పండుగలు, శుభకార్యాలకు వేళాయే..

- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- యాదగిరిగుట్ట క్షేత్రంలో తిరునక్షత్ర వేడుకలు, పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట: హిందూ సంప్రదాయంలో శ్రావణ మాసానికి ప్రత్యేక స్థానం ఉంది. వివాహాది శుభ కార్యాలకు అనువైన మాసం. శుక్రవారం నుంచి శ్రావణ మాసం మొదలై ఆగస్టు 22వ తేదీ వరకు కొనసాగనుంది. నెల రోజుల పాటు వరలక్ష్మీ అమ్మవారికి పూజలు చేయడంతో పాటు మహిళలు వ్రతాలు ఆచరిస్తారు. వివాహాలు, గృహ ప్రవేశాలు, నిశ్చితార్థాలు, శంకుస్థాపనలు, వ్యాపార ప్రారంభోత్సవాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఈ మాసంలోనే అధికంగా నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో ప్రత్యేక పూజలు అందుకునేందుకు యాదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు ఇతర ఆలయాలు ముస్తాబవుతున్నాయి.

వరలక్ష్మీ వ్రతాలు.. బోనాల సందడి...

శ్రావణ మాసం అంటే మహిళలకు గుర్తుకొచ్చేవి వరలక్ష్మీ వ్రతాలు. లక్ష్మీదేవికి ప్రీతికరమైన ఈ శ్రావణ మాసం శుక్రవారం రోజునే ప్రారంభం కావడం మరింత విశేషాన్ని సంతరించుకుంది. ఈ మాసంలో వచ్చే 3వ శుక్రవారం ఆగస్టు 8వ తేదీన మహిళలు వరలక్ష్మీ వ్రతం చేసుకుంటారు. ఆ రోజున కుదరని వారు నాలుగు, ఐదు శుక్రవారాల్లో సైతం వ్రతాన్ని ఆచరించనున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో లక్ష్మీదేవితో పాటు అమ్మవార్ల దేవాలయాల్లో విశేష పూజలు, వ్రతాలు, సామూహిక కుంకుమార్చనలు వంటి పూజలుంటాయి. ఆషాఢంలో లష్కర్‌లో బోనాల జాతర ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో శ్రావణ మాసంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనావాయితీగా వస్తుంది.

మొదలుకానున్న శుభ ముహూర్తాలు..

శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలను ప్రజలు వెతుకుతున్నారు. ఈ నెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 8, 10, 13, 14, 17, 18 తేదీల్లో శుభకార్యాలు నిర్వహించేందుకు మంచి ముహూర్తాలు ఉన్నాయని అర్చకులు చెబుతున్నారు.


వరలక్ష్మీ అమ్మవారు

విశేష దినాలు ఇవే..

ఈ నెల 26 నుంచి 28వ తేదీ వదరకు శ్రీఆండాల్ అమ్మవారి తిరు నక్షత్ర ఉత్సవం యాదగిరి క్షేత్రంలో జరపనున్నారు. 29వ తేదీన నాగుల పంచమి, ఆగస్టు 1వ తేదీన యాదగిరీశుడి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణ మరింత విశేషంగా నిర్వహిస్తారు. 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు జరిపిస్తారు. 5వ తేదీన ఏకాదశి, 8వ తేదీన వరలక్ష్మీ వ్రతం, 9వ తేదీన రాఖీ పూర్ణిమ, శ్రీగాయత్రీ జయంతి, హయగ్రీవ జయంతి వస్తుంది. 12వ తేదీన సంకష్టహర చతుర్థీ వ్రతం, 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం, 16వ తేదీన స్మార్త శ్రీకృష్ణ జయంతి వంటి పండుగలు రానున్నాయి.

శ్రావణ మాసం పవిత్రమైనది



శ్రావణ మాసం ఎంతో పవిత్రమైనది. ఈసారి శ్రావణ మాసం శుక్రవారంతో ప్రారంభమవుతుంది. అంతేకాకుండా ఈ మాసంలో 5 శుక్రవారాలు రావడం మరో విశేషం. నెల రోజుల పాటు మహిళలు అమ్మవారిని కొలుస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ మాసంలోనే శుభకార్యాలకు మంచిగా భావించి, చాలా మంది వివాహాలు చేయడంతో పాటు గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలు చేస్తుంటారు. యాదగిరి ఆలయంలో ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు, శ్రీస్వామి జన్మనక్షత్రం స్వాతి, స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ మాసంలో రావడం విశేషం.

– మంగళగిరి నర్సింహమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ముఖ్య అర్చకుడు

ప్రతి మంగళవారం మంగళగౌరీ వ్రతం..

మహిళలు నిండు నూరేళ్ల సౌభాగ్యవతిగా ఉండాలని, మంచి సంతానం కలగాలని కోరుకుంటూ నూతన వధువులు ఈ శ్రావణ మాసంలో ప్రతి మంగళవారం మంగళగౌరీ వ్రతం నిర్వహిస్తారు. అన్యోన్య దాంపత్యం, మంచి సంతానం కలగాలని ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. వివాహం జరిగిన మొదటి ఐదేండ్ల పాటు ఈ మాసంలో ప్రతి మంగళవారం వ్రతం చేపడతారు. ఇక సర్పదోషాలు తొలగిపోవడానికి నాగుల పంచమి పండుగను జరుపుకుంటారు. నాగదేవత పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేస్తారు. వెండితో నాగ ప్రతిమలు చేసి పుట్టల్లో వదులుతారు. అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించి సౌభాగ్యంతో వర్థిల్లాలని కోరుతూ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

రూ.1.65కోట్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు!

- బాధితుడు సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారికి ట్రేడింగ్‌లో లాభాలు అంటూ సైబర్ నేరగాళ్లు ఆశచూపి రూ.1.65 కోట్లు కాజేసినట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. సదరు వ్యాపారి ఇంటర్నెట్ బ్రౌజింగ్ చేస్తుండగా ట్రేడింగ్ సైట్ ఓపెన్ కాగా.. మంచి లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దీంతో దాన్ని నమ్మిన వ్యాపారి తన బ్యాంక్ ఖాతా వివరాలు, ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేశాడు. సైబర్ నేరగాళ్లు తిరిగి వ్యాపారికి ఒక ఐడీ ఇవ్వగా.. అతడు ముందుగా రూ.43 వేలు డిపాజిట్ చేశాడు. డిపాజిట్ చేసినందుకు గాను రూ.4250 లాభం వచ్చినట్లు నగదును తిరిగి వ్యాపారి ఖాతాలోకి వేశారు. పూర్తిగా నమ్మిన వ్యాపారి జూన్ 9 నుంచి జూలై 17వ తేదీ వరకు రూ.1.66 కోట్లు డిపాజిట్ చేశాడు. పెట్టిన పెట్టుబడికి డబుల్ లాభం వచ్చిందని ఆ డబ్బు వ్యాపారి ఐడీలో జమ అయినట్లు సైబర్ నేరగాళ్లు చూపించారు. దీంతో వ్యాపారి విత్‌డ్రాకు ప్రయత్నించగా.. సైబర్ నేరగాళ్లు 20శాతం కమీషన్ అడిగారు. కమీషన్ చెల్లించడంలో వ్యాపారి ఆలస్యం చేయడంతో రూ.1.66కోట్లు ఫ్రీజ్ అయినట్లు సైబర్ నేరగాళ్లు వ్యాపారి ఐడీలో చూపించారు. దీంతో సైట్‌కు సంబంధించిన వాట్సాప్ నంబర్‌ను వ్యాపారి సంప్రదించగా అటు నుంచి స్పందన రాలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన ఆ వ్యాపారి ఈ నెల 19న రాచకొండ సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని బీబీనగర్ పోలీసులు తెలిపారు.

భర్తపై భార్య హత్యాయత్నం.. కేసు నమోదు

- ఆమెకు సహకరించిన కానిస్టేబుల్ సస్పెన్షన్

నల్లగొండ: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య చేసేందుకు ప్రయత్నించిన భార్యపై నల్లగొండ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఆమెకు సహకరించిన కానిస్టేబుల్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ బుధవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలో జరిగింది. నల్లగొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీలో రవికుమార్, అతడి భార్య నివాసముంటున్నారు. వీరి ఇంటి ఎదురుగా చండూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే ఖలీల్ నివాసముంటున్నాడు. కొంతకాలంగా రవికుమార్ భార్య, ఖలీల్ మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం రవికుమార్‌కు తెలియడంతో భార్యను మందలించాడు. ఈ క్రమంలో తాను ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తన భార్య తన తలపై దిండు పెట్టి చంపాలని చూసిందని, ఇందుకు కానిస్టేబుల్ ఖలీల్ సహకారించాడంటూ రవికుమార్ మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 'నీ భర్తకు విడాకులు ఇవ్వు' అంటూ ఖలీల్ రవికుమార్ భార్యకు వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్‌లను అతడు పోలీసులకు అందించాడు. ఈ మేరకు రవికుమార్ భార్య, ఖలీల్‌పై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కానిస్టేబుల్ ఖలీల్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆటోలో నుంచి కిందపడి యువకుడు మృతి

రామన్నపేట: ఆటోలో నుంచి కిందపడి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి రామన్నపేట మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడేనికి చెందిన అమరోజు సాయిభాను(30) మంగళవారం పని నిమిత్తం రామన్నపేటకు వచ్చాడు. రాత్రి ట్రాలీ ఆటోలో చిట్యాలకు వెళ్తుండగా.. రామన్నపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆటోలో నుంచి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు సాయిచంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మద్దిరాల: మద్దిరాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని మంగళవారం రాత్రి అదృశ్యమైంది. నైట్ వాచ్‌మెన్ నిర్లక్ష్యం కారణంగానే తన కుమార్తె అదృశ్యమైందని విద్యార్థిని తండ్రి బుధవారం ఇచ్చిన ఫిదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు మద్దిరాల పోలీస్ స్టేషన్ ఎస్ఐ వీరన్న తెలిపారు.

'నవోదయ' అథ్లెటిక్ మీట్ ప్రారంభం


క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎంఈఓ తరి రాములు


మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

పెద్దవూర: పెద్దవూర మండల పరిధిలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న తెలంగాణ క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్–2025 బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మండల విద్యాధికారి తరి రాములు ప్రారంభించి మాట్లాడారు. ఓటమి అనేది గెలుపునకు నాంది కావాలని, ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడకుండా గెలుపుకోసం ప్రయత్నం చేయాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిత్య జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదవడం అంటే విద్యార్థులు అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ మత్తు పదార్థాలు తీసుకుకోవడం కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శవంతమైన సమాజానికి మార్గనిర్దేశం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 9 జవహర్ నవోదయ విద్యాలయాల నుంచి 57 మంది బాలురు, 39 మంది బాలికలు కలిపి ఈ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొననున్నారు. అంతకుముందు వివిధ జేఎన్‌వీల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో చలకుర్తి జేఎన్‌వీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. శంకర్, నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ చక్రవర్తి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి డి. విమల, క్రీడా ఆర్గనైజర్ పీడీ మంజులారాధ, పీడీలు శోభారాణి, వెంకట్రాంరెడ్డి, కూతాటి మురళి, లెనిన్‌బాబు, శంభులింగం, వెంకట్, అలివేలు, ఎల్లయ్య, అధ్యాపకులు విష్ణువర్ధన్‌శర్మ, అమర్‌లింగాచారి తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడి సేవలో సినీ నటుడు మురళీమోహన్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సినీ నటుడు మురళీమోహన్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం బ్రేక్ దర్శనంలో దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


మురళీమోహన్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

మధుసూదన్‌రెడ్డి మృతికి సంతాపం

- ఓయూ మాజీ ప్రిన్సిపాల్ సేవలను గుర్తుచేసుకున్న శివన్నగూడెం


నివాళులర్పిస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మర్రిగూడ: తెలంగాణ ఉద్యమకారుడు, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కుంభం మధుసూదన్‌రెడ్డి(90) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో తన నివాసంలో మృతిచెందారు. ఆయన స్వస్థలం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం గ్రామం కాగా.. ఆయన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. మధుసూదన్‌రెడ్డి 1935లో శివన్నగూడెం గ్రామంలో చిన శివారెడ్డి, రంగనాయకమ్మ దంపతులకు జన్మించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమకాలంలో కవి అందెశ్రీతో పాటు రాష్ట్ర కళాకారులతో మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన ధూంధాం కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను జాగృతం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన సలహాదారులుగా కూడా ఆయన పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన పలు అంశాలపై దేశ, విదేశాల్లో పలు సదస్సులు నిర్వహించి పరిశోధన వ్యాసాలు రాశారు. మధుసూదన్‌రెడ్డికి భార్య విమల, ముగ్గురు కుమార్తెలు నళిని, అరుంధతి, గాయత్రి ఉన్నారు. మధుసూదన్‌రెడ్డి మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బుధవారం ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మృతి విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

జ్యువెలరీ షాపు కొల్లగొట్టింది యూపీ గ్యాంగే..!

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా యూపీకి చెందిన దంపతులను ఖమ్మంలో పట్టుకొని విచారించిన పోలీసులు
- చోరీ చేసిన దొంగల అడ్రస్ చెప్పినట్లు సమాచారం

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయిసంతోషి జ్యువెలరీ షాపులో చోరీకి పాల్పడింది ఉత్తరప్రదేశ్ గ్యాంగేనని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. దొంగలు వాడుతున్న సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారితో ఎవరెవరు మాట్లాడుతున్నారని పోలీసులు ట్రేసింగ్ చేయగా ఖమ్మంలో నివాసముంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన దంపతులు వారితో మాట్లాడుతున్నట్లు నిర్ధారణ అయినట్లు సమాచారం. అయితే మంగళవారం ఆ భార్యాభర్తను పోలీసులు సూర్యాపేటకు తీసుకొచ్చి విచారించగా.. నిందితులకు తమకు ఎలాంటి సంబంధం లేదని, వారు కేవలం తెలిసిన వ్యక్తులు మాత్రమేనని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. వారు నిందితుల అడ్రస్, ఇతర వివరాలు పోలీసులకు తెలియజేసినట్లు తెలుస్తోంది.

ఢిల్లీ, జార్ఖండ్, యూపీ రాష్ట్రాల్లో గాలింపు..

నిందితులను పట్టుకునేందుకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐదు బృందాలను ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వారిని పట్టుకునేందుకు పోలీస్ బృందాలు ఢిల్లీ, జార్ఖండ్, యూపీ రాష్ట్రాల్లో గాలిస్తున్నట్లు తెలిసింది. యూపీలో ఒకరిని సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రేసింగ్ చేసినట్లు సమాచారం. వారిని పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తోంది.

గ్యాస్ కట్టర్ పైపు సూర్యాపేటలోనే కొనుగోలు..

దొంగతనం చేసేందుకు నిందితులు రెండు గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేశారు. అయితే అందులో ఒక సిలిండర్‌ను దొంగతనం జరిగిన రోజే కోదాడలో కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కాగా గ్యాస్ కట్టర్‌కు ఉపయోగించే పైపులు మాత్రం సూర్యాపేట పట్టణంలోని మధు గ్యాస్ దుకాణంలో కొనుగోలు చేశారు. శుక్రవారం సాయంత్రం నలుగురు ఆటోలో వచ్చి నాలుగు మీటర్ల గ్యాస్ పైపు కావాలని హిందీలోనే అడిగి కొనుగోలు చేసినట్లు షాపు నిర్వాహకుడు చెబుతున్నాడు.

ఉప రాష్ట్రపతి రాజీనామాపై వివరణ ఇవ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

బీబీనగర్: ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీష్ ధన్కడ్ రాజీనామాపై బీజేపీ వివరణ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బీబీనగర్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 8న దేశ వ్యాప్తంగా నిరసనలు తెలుపనున్నట్లు చెప్పారు. మూడు నెలలు అవుతున్నా బీసీల 42శాతం రిజర్వేషన్ల విషయంపై ఆమోదం లేదన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ సాధారణ ఆసుపత్రిలాగే మారిందని, నిధులు లేక ఎమర్జెన్సీ సేవలు అందుబాటులోకి రాలేదన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై అఖిలపక్ష నాయకులతో చర్చించాలన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జహంగీర్, నాయకులు నరసింహ, పెంటయ్య, చంద్రారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

దొంగల ముఠా అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- బంగారు, వెండి ఆభరణాలు, బైక్, రెండు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని రాత్రివేళ చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగల ముఠాను నల్లగొండ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌కు చెందిన బాలెం రాజేష్, హైదరాబాద్‌లోని బాలాపూర్ చౌరస్తాకు దస్తర్ బండి షఫీ గతంలో హైదరాబాద్‌లో బైక్‌లు చోరీ చేసిన కేసుల్లో చర్లపల్లి జైలుకు వెళ్లి వచ్చారు. కట్టంగూర్ మండలం ఎరసానిగూడేనికి చెందిన ఉబ్బని యోగేశ్వర్ అలియాస్ యోగి రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో యోగేశ్వర్‌కు బాలెం రాజేష్, దస్తర్ బండి షఫీ పరిచయమయ్యారు. వీరంతా మద్యానికి బానిసై, విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాత్రివేళ చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. యోగేశ్వర్ తన స్నేహితుడైన నల్లగొండ పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన వల్లూరి యువరాజ్ చంద్రతో పాటు సాయికుమార్, శ్రీకాంత్‌కు విషయం చెప్పాడు. వీరితో పాటు గతంలో గంజాయి కేసులో జైలుకు వెళ్లి వచ్చిన తలారి మనోజ్ కలిసి ముఠాగా ఏర్పడి చోరీలు చేయడం ప్రారంభించారు. వీరు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 3, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 1, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 4, నల్లగొండ జిల్లాలో 14 చోరీలకు పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం నల్లగొండ బస్టాండ్ ఎదురుగా ఉన్న సవేరా లాడ్జిలో వీరు ఉన్నట్లు పక్కా సమాచారంతో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులు తన సిబ్బందితో కలిసి లాడ్జిపై దాడి చేసి బాలెం రాజేష్, దస్తర్ బండి షఫీ, ఉబ్బని యోగేశ్వర్, తలారి రాజేష్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 20 తులాల బంగారు ఆభరణాలు, ఒక కేజీ 800 గ్రాముల వెండి ఆభరణాలు, వెండి చెంబు, ప్లేట్, బైక్, రెండు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. సాయికుమార్, శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న టూ టౌన్ సీఐ రాఘవరావు ఎస్ఐ సైదులు, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు, హెడ్ కానిస్టేబుల్ పాయిలి రాజు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.